## క్లుప్తంగా

### కొనసాగుతున్న ప్రత్యేక పారిశుద్ధ్య పనులు



నెహ్రూనగర్: విజయవాడ నగరంలో వరద ప్రభావిత ప్రాంతాలను పూర్వస్థితికి తెచ్చేందుకు కృషి చేస్తున్నామని గుంటూరు నగర కమిషనర్ పులి శ్రీనివాసులు తెలిపారు. ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు, మంత్రి నారాయణ ఆదేశాల మేరకు విజయవాడలోని 62వ డివిజన్ పైపుల రోడ్డులో చేపట్టిన ప్రత్యేక పారిశుద్ధ్య పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ శ్రీనివాసులు మాట్లాడుతూ.. ప్రత్యేక పారిశుద్ధ్య పనుల్లో 100 మంది కార్మికులు, నలుగురు కమిషనర్లు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, కార్యదర్శులతో సమన్వయం చేసుకుంటున్నామన్నారు. పారిశుద్ధ్య పనుల్లో భాగంగా వచ్చిన వ్యర్థాలను ఎప్పటికప్పుడు ట్రాక్టర్ల ద్వారా తరలిస్తున్నామన్నారు. అతి త్వరలో తమకు కేటాయించిన ప్రాంతాన్ని సాధారణ స్థితికి తీసుకురావడానికి కృషి చేస్తున్నామని తెలిపారు. ఆయన స్వయంగా ట్రాక్టర్ నడిపి శానిటేషన్ వ్యవస్థను పరిశీలించారు.

### శత సహస్ర మోదక లక్ష్మీ గణపతి హోమం ప్రారంభం

విజయవాడ కల్చరల్: శృంగేరీ జగద్గురువులు భారతీ తీర్థ మహాస్వామి, విధుశేఖర భారతీ స్వామి ఆదేశంతో 25 రోజులపాటు నిర్వహించే శత సహస్ర(లక్ష) మోదక శ్రీ లక్ష్మీ గణపతి హోమం గురువారం శివరామ కృష్ణ క్షేత్రంలో ప్రారంభమయింది. శృంగేరీ పీఠం నుంచి వచ్చిన పండితులు హోమం చేశారు. శివరామ కృష్ణ క్షేత్రం ధర్మాధికారి హనుమత్ ప్రసాద్, గండూరి చంద్రమౌళి, సంస్కృత పండితుడు డాక్టర్ ధూళిపాళ రామ కృష్ణ నిర్వహించారు.

### కళా సంక్షేమమే సంస్కార భారతి లక్ష్యం



విజయవాడ కల్చరల్: కళా సంక్షేమమే సంస్కార భారతి లక్ష్యమని ఆ సంస్థ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ పీవీఎస్ కృష్ణ అన్నారు. ఆ సంస్థ నగర శాఖ ఆధ్వర్యంలో తుఫాను కారణంగా ఇబ్బంది పడుతున్న కళాకారులు, సాహిత్యరంగానికి చెందిన వారికి ఆర్థిక సాయం చేశారు. అయోధ్యనగర్‌లోని 'హైందవి'లో గురువారం కళాకారులకు ఆర్థిక సాయం అందజేసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ పీవీఎస్ కృష్ణ మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా సంస్కార భారతి సేవలను అందిస్తున్నట్లు తెలిపారు. సంస్థ ప్రధాన కార్యదర్శి దర్భా శ్రీనివాస్ మాట్లాడుతూ సమాజానికి సేవలను అందిస్తే భగవత్ సేవగా భావించవచ్చని చెప్పారు. యువతను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దడానికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సంస్కార భారతి సహాయ కార్యదర్శి రాంకుమార్, సంస్థ ప్రతినిధులు సీతారత్నం, సాయి, భాస్కరశర్మ, కటారి విజయ్‌కుమార్, రాష్ట్రీయ స్వయం సేవక్ విభాగ కార్యదర్శి చక్రధారి పాల్గొన్నారు. సంస్కార భారతి ధ్యేయగీత ఆలాపన అనంతరం కళాకారులకు ఆర్థిక సాయం అందించారు.

### వరద పాలైన మొక్కజొన్న, ఎరువులు



కొటికలపూడి(ఇబ్రహీంపట్నం): కొటికలపూడి గ్రామంలోని ప్రేమధార పరస్పర సహకార సంఘం గోడౌన్ వరద నీటి ముంపునకు గురైంది. గోడౌన్‌లో రైతులు నిల్వ చేసుకున్న 450 మొక్కజొన్న విత్తన బస్తాలు, 350 వివిధ రకాల కాంప్లెక్స్ ఎరువుల బస్తాలు తడిచిపోయాయి. ఈ సొసైటీ జిల్లా ఉద్యాన శాఖ, నాబార్డ్ సహకారంతో రైతులు నిర్వహిస్తున్నారు. ఆసరాగా ఉంటుందని గోడౌన్‌లో నిల్వ ఉంచిన మొక్కజొన్న, ఎరువులు తడవడంతో సుమారు రూ. 12 లక్షల వరకు నష్టం వాటిల్లిందని సొసైటీ అధ్యక్షుడు చాట్రగడ్డ కోటయ్య తెలిపారు. రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని ఆయన కోరారు.

### వినాయక విగ్రహాలు సిద్ధం



మధురానగర్(విజయవాడసెంట్రల్): వినాయక చవితి సమీపించటంతో నగరంలో వినాయక విగ్రహాలను విక్రయాలకు సిద్ధం చేశారు. ఇక్కడ అడుగు విగ్రహం నుంచి 8 అడుగుల వరకు విగ్రహాలను అందుబాటులో ఉంచారు. రూ.2 వేలు నుంచి రూ.20 వేలు వరకు సైజు, మోడల్‌ను బట్టి విక్రయించనున్నట్లు వ్యాపారులు తెలిపారు. వరదలు, వర్షాల నేపథ్యంలో ఇప్పటివరకు విక్రయాలు అంతంత మాత్రంగానే ఉన్నాయని తెలిపారు.

# వదలని వరద వ్యథ



చెరువులా విజయవాడ - నూజివీడు రహదారి



అంబాపురం ప్రాంతంలో నీట మునిగిన కారు

బుడమేరు వరద నగరాన్ని చుట్టుముట్టి ఐదు రోజులవుతోంది. అయినా ప్రభుత్వం, అధికారుల నిర్లక్ష్యంతో ప్రజలకు వరద కష్టాలు వెంటాడుతూనే ఉన్నాయి. ప్రధాన రహదారుల్లో వరద నీరు లేకపోయినా అంతర్గత రోడ్లు, గృహాల్లో వరద బురద వీడటం లేదు. భారీగా వ్యర్థాలు వస్తుండడంతో వరద ప్రభావిత ప్రాంతాల్లో దుర్వాసన వెదజల్లుతోంది. కొన్ని ప్రాంతాల్లో నీటి ప్రవాహం తగ్గడంతో ఇళ్లను, దుకాణాలను శుభ్రం చేసే పనుల్లో ప్రజలు నిమగ్నమయ్యారు.

–సాక్షి ఫొటోగ్రాఫర్స్, విజయవాడ



అంబాపురం వద్ద వరద నీటిలో సామగ్రి తీసుకెళ్తున్న ప్రజలు



పైపులరోడ్డులో గృహోపకరణాలు తీసుకుని శుభ్రం చేసుకుంటున్న గృహిణి



అల్పాహారం, పాలప్యాకెట్లు తీసుకెళ్తున్న మహిళలు



సింగ్‌నగర్ నుంచి ఆటోలో సామగ్రిని తరలిస్తున్న ఓ కుటుంబం



రాజరాజేశ్వరిపేటలో పాలప్యాకెట్లు, మంచినీరు, అల్పాహారం అందజేస్తున్న స్వచ్ఛందసంస్థ ప్రతినిధులు



అంబాపురం వద్ద వరద నీటిలో గేదెలు



శాంతినగర్‌లో వరద నీటిలో నీరు పట్టుకుంటున్న దృశ్యం



సింగ్‌నగర్‌లో షెడ్‌ను శుభ్రం చేస్తున్న మెకానిక్‌లు

## బెరంపార్క్, సైన్స్ సెంటర్లలో తొలగుతున్న బురద



వరద నీటి మునకలో రీజనల్ సైన్స్ సెంటర్



బెరంపార్క్‌లో బోటింగ్ పాయింట్ జట్టీ వద్ద పేరుకుపోయిన గుర్రపుడెక్క

భవానీపురం(విజయవాడపశ్చిమ): బుడమేరు వరద ప్రభావంతో భవానీపురంలోని ఆంధ్రప్రదేశ్ పర్యాటక శాఖకు చెందిన బెరంపార్క్, అప్‌కాస్ట్ రీజనల్ సైన్స్ సెంటర్ దాదాపు 10 అడుగులపైనే మునిగింది. వరద ఉధృతి గురించి ప్రభుత్వం ఎటువంటి ముందస్తు సమాచారం ఇవ్వకపోవడంతో బెరంపార్క్‌లోని రిసెప్షన్, బార్ (గతంలో రెస్టారెంట్), కాన్ఫరెన్స్ హాల్‌లోని ఫైల్స్, వస్తు సామగ్రిని బయటకు తీసుకురాలేదు. దీంతో అవన్నీ తడిసిపోయి బురదలో ఉండిపోయాయి. గురువారం నాటికి వరద నీరు తగ్గటంతో బురద తొలగించే పనిలో పడ్డారు. అలాగే అప్‌కాస్ట్ రీజనల్ సైన్స్ సెంటర్ కూడా అదే పరిస్థితి నెలకొంది. ప్రాంగణం మొత్తం బురదమయం కావడంతోపాటు లోపల గ్రౌండ్ ఫ్లోర్‌లో ఉన్న సైన్స్ ఎగ్జిబిట్స్ తడిసిపోయి బురద మేట వేసింది. అగ్నిమాపక శాఖ వాహనంతో పనులు చేపట్టారు. బెరంపార్క్, సైన్స్ సెంటర్లలో మొత్తం ప్రక్షాళనం కావాలంటే మరో మూడు రోజులు పడుతుందని సిబ్బంది తెలిపారు. కాగా బెరంపార్క్‌లోని బోటింగ్ పాయింట్ పరిస్థితి అధ్వానంగా మారింది. జట్టీ వద్ద తాళ్లతో కట్టేసిన బోట్లన్నీ చెల్లాచెదురయ్యాయి. ఎగువ నుంచి వరద నీటితోపాటు కొట్టుకు వచ్చిన గుర్రపుడెక్క పున్నమి ఘాట్, బోటింగ్ పాయింట్ వద్దకు చేరుకుని గందరగోళంగా మారింది.



సైన్స్ సెంటర్‌ను శుభ్రం చేస్తున్న సిబ్బంది

## రిటైనింగ్ వాల్ నిర్మాణానికి చర్యలు



రిటైనింగ్ వాల్ నిర్మాణాన్ని పరిశీలిస్తున్న డీన్ పాండురంగారావు, దుర్గగుడి ఈవో రామరావు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): శ్రీదుర్గామల్లేశ్వరస్వామి వార్ల దేవస్థాన ఘాట్‌రోడ్డులో విరిగి పడిన కొండ చరియల వద్ద రిటైనింగ్ వాల్ నిర్మాణానికి అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని ఈవో కె.ఎస్.రామరావు చెప్పారు. దుర్గాఘాట్ ఎదుట నిర్మాణంలో ఉన్న రిటైనింగ్ వాల్, ఘాట్‌రోడ్డులో విరిగిపడిన గోడ ప్రాంతాలను గురువారం సిద్ధార్థ ఇంజినీరింగ్ కాలేజీ డీన్ పాండురంగారావుతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. కొండ రాళ్లు విరిగిపడిన ప్రాంతంలో ఇబ్బంది కలగకుండా వాల్ నిర్మాణానికి అవసరమైన ప్లాన్‌ను తక్కువ సమయంలో దేవస్థానానికి అందజేస్తామని పాండురంగారావు పేర్కొన్నారు. పనుల నాణ్యత, భక్తులకు ఇబ్బందులు కలగకుండా పూర్తయ్యేలా చూడాలని ఈఈ కేవీఎస్ కోటేశ్వరరావును ఈవో ఆదేశించారు.

## గ్యాస్ స్టవ్ మరమ్మతు సెంటర్లు ఇవే!

సాక్షి, అమరావతి: వరద బాధితు సహాయార్థం ముంపు ప్రాంతాల్లో గ్యాస్ స్టవ్ రిపేరు, సిలిండర్ల సరఫరాకు ప్రత్యేక చర్యలు చేపట్టినట్టు పౌరసరఫరాల శాఖ కమిషనర్ వీరపాండియన్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. 10 ఉచిత సర్వీసు సెంటర్లలో నీటిలో మునిగిపోయిన స్టౌలను మరమ్మతులు చేసుకోవాలని సూచించారు. స్పేర్ పార్ట్స్ అవసరమైతే తక్కువ ధరకే అందించడానికి గ్యాస్ కంపెనీలు అంగీకరించాయని తెలిపారు.

**ఉచిత గ్యాస్ స్టౌ సర్వీసు సెంటర్లు ఇలా..**

- వార్డు సెక్రటేరియట్ నంబర్ 42,
- షాదీఖానా గుప్తా సెంటర్, కుమ్మరిపాలెం
- ఈద్గా మహల్, చిట్టినగర్
- ఆర్‌సీఎం స్కూల్
- ఎంఎల్‌ఎస్ పాయింట్,గొల్లపూడి
- గోకరాజు గంగరాజు స్కూల్
- ఎస్సీ కమ్యూనిటీ హాల్, మొగల్రాజపురం
- ఏపీఎస్‌ఆర్‌ఎంసీ స్కూల్
- రవీంద్ర భారతి స్కూల్, సత్యనారాయణ పురం
- కేబీఎన్ కాలేజీ, వన్‌టౌన్

# ముంపు బాధితులకు సాయం అందజేత

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రతిపక్షంపై విమర్శలు మాని బాధిత కుటుంబాలకు సాయమందించటంలో శ్రద్ధ చూపాలని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పశ్చిమ నియోజకవర్గ ఇన్‌చార్జి షేక్ ఆసిఫ్ హితవు పలికారు. నియోజకవర్గంలో గురువారం వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో వరద బాధిత కుటుంబాలకు పాలు, మంచినీరు, ఆహారం పంపిణీ కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా వాటికి సంబంధించిన వాహనాలను వించిపేటలోని పార్టీ కార్యాలయం వద్ద ఆసిఫ్ ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. నగరంలోని చాలా ప్రాంతాలకు ఆహారం అందటం లేదన్నారు. వృద్ధులు, చిన్నారులు ఆహారం మంచి నీటి కోసం అల్లాడిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ యంత్రాంగం వరద సాయమందించటంలో పూర్తిగా విఫలమైందన్నారు. పలు ప్రాంతాల్లో బాధిత కుటుంబాల రోధన హృదయ విదారకంగా ఉందన్నారు. అటువంటి వారిని ఆదుకోవాల్సిన ప్రభుత్వం, ముఖ్యమంత్రి ప్రతిపక్షాన్ని విమర్శిస్తూ కాలం గడుపుతున్నారని చెప్పారు. కార్యక్రమంలో నాయకులు వినోద్, అప్సర్, కాజా, నయీమ్, రషీద్, బాజీ, శంకర్‌రెడ్డి, శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



వాహనాలను ప్రారంభిస్తున్న ఆసిఫ్



వరద బాధితులకు సాయం అందజేస్తున్న న్యాయమూర్తి సత్యానంద్

**పీఆర్టీయూ, సేవాదళ్ సేవలు**

కృష్ణలంక(విజయవాడతూర్పు): ఉపాధ్యాయ దినోత్సవ రోజున వరద బాధితులకు ఆహార పదార్థాలు, తాగునీరు పిల్లలకు పాలు, రొట్టెలు అందజేయడం డెమొక్రటిక్ పీఆర్టీయూ ఉపాధ్యాయ సంఘం సేవా నిరతి అభినందనీయమని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ పరీక్షల విభాగ డైరెక్టర్ డి.దేవానందరెడ్డి అన్నారు. డెమొక్రటిక్ పీఆర్టీయూ, ఉపాధ్యాయ సేవాదళ్ సంయుక్తంగా ఏర్పాటుచేసిన ఆహార పదార్థాలను ఇతర సామగ్రిని గురువారం ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ వాహనాల ద్వారా కబేళా, అంపాపురం, జక్కంపూడి కాలనీలో పంపిణీ చేశారు. ఉపాధ్యాయుల సహాయ సహకారాలతో సాయం అందజేశామని డెమొక్రటిక్ పీఆర్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ శ్రీను తెలిపారు. సామాజిక బాధ్యతతో ఉపాధ్యాయ సేవాదళ్ సేవలను రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ డాక్టర్ ఏ.శ్రీధర్‌రెడ్డి కొనియాడారు. కార్యక్రమంలో సభ్యులు వెంకటరెడ్డి, పి.కుమార్ రాజా, రాజేష్ నాయక్, పీత రమేష్, శ్రీనివాసరావు, వెంకటేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

**వరద బాధితులకు న్యాయమూర్తి సత్యానంద్ సాయం**

భవానీపురం(విజయవాడపశ్చిమ): గొల్లపూడి గ్రామానికి చెందిన బుడమేరు వరద బాధితులకు సెకండ్ అడిషనల్ మేజిస్ట్రేట్ కోర్ట్ న్యాయమూర్తి ఎ.సత్యానంద్ సాయం అందజేశారు. గొల్లపూడి మౌలానగర్‌లోని షాదీఖానాలో, అలాగే అంబేడ్కర్‌నగర్‌లోని కమ్యూనిటీ హాల్‌లో 200 మంది బాధితులకు దుప్పట్లు, పండ్లు, బిస్కెట్లు, బ్రెడ్, చీరలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి సత్యానంద్ మాట్లాడుతూ.. ప్రకృతి విపత్తుల్లో అనేక మంది పేదలు నష్టపోవడం దురదృష్టకరమన్నారు. ఇంట్లో సామాన్లంటినీ వదిలేసి కట్టుబట్టలతో బయటకు వచ్చేసిన వారం దరూ నిరాశ్రయులుగా మారి తాగునీరు, ఆహారం దొరక్క ఇబ్బందులు పడటం బాధాకరమని చెప్పారు. ఇటువంటి సమయంలో వరద బాధితులకు సాయం అందించటం సామాజిక బాధ్యతగా భావించి తన వంతు సాయం అందజేశానని తెలిపారు. కార్యక్రమంలో కమర్షియల్ కోర్ట్ జడ్జి పి.శ్రీధర్, ఏజీపీ చిన్నం రామకృష్ణ, స్థానికులు అంకిత కిట్టి, చిన్నం శ్రీదేవి, గాయత్రి, కమల తదితరులు పాల్గొన్నారు.

## మధురంగా వయోలిన్ కచేరీ



విజయవాడ కల్చరల్: స్వరఝరి సంగీత సేవా సంస్థ నెలవారీ సంగీత కార్యక్రమంలో భాగంగా గాంధీనగర్‌లోని కౌతా పూర్ణానందం కళావేదికమీద గురువారం వయోలిన్ విద్వాంసుడు పెరవలి నందకుమార్ నిర్వహించిన వయోలిన్ కచేరీ మధురంగా సాగింది. పెరవలి జయతి సహవయోలిన్ సహకారం, సద్గురు చరణ్ మృదంగం, ఎం. హరిబాబు ఘటంపై సహకరించారు. మంచాల జగన్నాథరావు సంకలన పరచిన కృతి రత్నావళిని అతిథులు ఆవిష్కరించారు. సంగీత విద్వాంసుడు మోదుమూడి సుధాకర్ మాట్లాడుతూ సంగీత అభిమానులు అధ్యయనం చేయవల్సిన గ్రంథంగా అభివర్ణించారు. మంచాల జగన్నాథరావు, అంజనా సుధాకర్ పాల్గొన్నారు.

## 14 ఇళ్లు పాక్షికంగా ధ్వంసం

గంపలగూడెం: భారీ వర్షాలకు మండలంలో 14 ఇళ్లు పాక్షికంగా దెబ్బతిన్నాయని తహసీల్దార్ రాజకుమారి తెలిపారు. ఎనిమిది గ్రామాల పరిధిలోని ఈ గృహాలు వరదల కారణంగా దెబ్బతిన్నట్లు వీఆర్వోలు సర్వేలో తెలిపారు. ఇంకా ఎక్కడైనా ఇళ్లు దెబ్బతింటే స్థానిక వీఆర్వోలకు సమాచారం అందజేయాలన్నారు.